క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

తొగుట(దుబ్బాక): అనారోగ్యంతో బాధపడుతున్న గోవర్ధనగిరి సర్పంచ్ తోయేటి ఎల్లంను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు శుక్రవారం పరామర్శించారు. సర్పంచ్ ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇరుకోటి రమేశ్, మండల భైరయ్యలను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేవైఎం, జిల్లా మాజీ అధ్యక్షుడు విభీషన్‌రెడ్డి, నాయకులు స్వామిరెడ్డి, పరమేశ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారులోని ఎల్లంపల్లిలో 25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ లింగాల నిర్మల శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, ఎంపీటీసీ గుబిరె శారద, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ బండి రమేశ్, ఆలయ కమిటీ చైర్మన్ రాములు, వార్డు సభ్యురాలు అనురాధ, బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ నరేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా కార్యదర్శిగా రమేశ్



నియామకపత్రం అందుకుంటున్న రమేశ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): మాలమహానాడు జిల్లా కార్యదర్శిగా మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన రమేశ్‌ను నియమిస్తూ శుక్రవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య హైదరాబాద్‌లోని సంఘం భవనంలో నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల్లో మాల మహానాడు కమిటీలను వేసి బలోపేతం చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్యకు, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణు తదితరులు

దుబ్బాక: దుబ్బాక వైశ్య సంఘం వారి సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుబ్బాక పట్టణంలో ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కూర వేణు అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలో ఉచిత వైద్య శిబిరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్వైత హాస్పిటల్ వైద్యులు ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. డాక్టర్ల సలహా మేరకు రోగులకు ఉచితంగా మందులను కూడా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో వైశ్య సంఘం నాయకులు సుభాష్, రాజు, నాగరాజు, ఆంజనేయులు, నాగభూషణం, దుబ్బాక మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, తదితరులున్నారు.

పీఆర్ఏఈకి ఘనంగా వీడ్కోలు

వర్గల్(గజ్వేల్): సొంత రాష్ట్రం బీహార్‌లో ఉద్యోగం రావడంతో వర్గల్ మండల పంచాయతీరాజ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న నిజాముల్‌హక్ సిద్దిఖీ ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం వర్గల్ రైతువేదికలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన సేవలను ప్రశంసించారు. ఘన సన్మానం చేశారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యాహక్కు చట్టాన్ని పాఠశాలల నిర్వాహకులు పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట టౌన్ కమిటీ సమావేశానికి సంజీవ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. 2009వ సంవత్సరంలో తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజులో 25శాతం ఫీజు రాయితీ ఇవ్వాలన్నారు. అదేవిధంగా జర్నలిస్టుల పిల్లలకి 50శాతం ఫీజు మాఫీ కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి కనీస అవసరాలు తాగు నీరు, మరుగుదొడ్లు, ఫర్నీచర్, విద్యుత్ సరఫరా తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మొక్కలు నాటి.. సంరక్షణ మరిచి

- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- వృథాగా లక్షల రూపాయల నిధులు
- పట్టించుకోని అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో రోడ్లకు ఇరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు మండల వ్యాప్తంగా నీరులేక ఎండిపోతున్నాయి. మొక్కలకు సకాలంలో నీరు అందించకపోవడంతో పచ్చగా చిగురించాల్సిన మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. మొక్కలకు నీరు పట్టినట్లు రికార్డుల్లో చూపిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- మండలంలోని రహదారులకు ఇరువైపులా మొక్కలు పెంచాలని ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.
- మండలంలోని 11 గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా గత ఆగస్టులో 4 వేల మొక్కలను నాటారు. గుంతలు తవ్వడం, వాటిచుట్టూ కంచే ఏర్పాటు, నీరు పట్టేందుకు ఇప్పటివరకు లక్షల రూపాయలు ఖర్చు చేశారు.
- నీరు సక్రమంగా పోయకపోవడంతో పలు గ్రామాల్లో మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.
- ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన అధికారుల నిర్లక్ష్యంతో మొక్కలు ఎండిపోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- వెంటనే ఉన్నత అధికారులు స్పందించి ఎండిపోతున్న మొక్కలు కాపాడాలని అధికారులను కోరుతున్నారు.





మర్రిముచ్చాల నుంచి కొమురవెల్లికి వెళ్లే రోడ్డులో ఎండుతున్న మొక్కలు

బిల్లులు రాకపోవడంతో అశ్రద్ధ

గత సంవత్సరం నాటిన మొక్కలకు మార్చి 2023 వరకే మెయింటనెన్స్ బిల్లులు వచ్చాయి. తర్వాత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతోనే ప్రజాప్రతినిధులు మొక్కలకు నీరు అందించడంలో అశ్రద్ధ వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి మొక్కలకు నీరు అందించాలని సూచించిన వారు అందించడం లేదు.

–బాలలింగం, ఏపీఓ

నీరు పట్టించేందుకు ఏర్పాట్లు చేస్తాం..

నీరు లేకుండా మొక్కలు ఎండిపోతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా ప్రజాప్రతినిధులు నీరు పట్టించేందుకు ఏర్పాట్లు చేస్తాం. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటాం.

–అనురాధ, ఎంపీడీఓ

మంత్రి హరీశ్‌రావుకు సన్మానం

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి రిజర్వాయర్ కింద ముంపునకు గురైన ఐదు గిరిజన తండాల భూ నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ కింది ప్రతి కుటుంబానికి రూ.8లక్షల పరిహారం అందించారు. ఈ మేరకు శుక్రవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సంక్షేమ సంబరాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు హాజరై గిరిజన భూ నిర్వాసితులకు రూ.8లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో గిరిజనులకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారని, మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ పలువురు గిరిజన నాయకులు మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, నాయకులు ధరావత్ తిరుపతినాయక్, గుగులోతు రాజునాయక్, భూక్య కృష్ణనాయక్, ముడావత్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



హరీశ్‌రావును సన్మానిస్తున్న గిరిజన నేతలు

ఈజీఎస్ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలి



అంజిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఈజీఎస్‌లో పనిచేస్తున్న వారికి పేస్కేల్ అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఈజీఎస్ ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు మాల్లారెడ్డి జగదేవ్‌పూర్‌లోని డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డిలకు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈజీఎస్ ఉద్యోగులు కూడా సెర్ప్‌లో భాగమేనని తెలిపారు. ఈజీఎస్‌లో పనిచేస్తున్న ఏపీఓ, టీఏలు, ఈసీ, వాటర్‌మ్యాన్‌లకు పేస్కేల్‌ను అమలు చేయాలని వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీఏలు కరుణాకర్‌రెడ్డి, రాజు, తిరుపతిరెడ్డి, నరేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బంగారులొద్దితండాను జీపీ చేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం రామవరం గ్రామ పరిధిలోని బంగారులొద్దితండా, పునరావాస కాలనీను కలుపుతూ నూతనంగా బంగారులొద్దితండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని నిరసిస్తూ శుక్రవారం గిరిజనులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 800కుపైగా జనాభా కలిగిన గిరిజన తండాను తక్షణమే గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మా తండా, మా పాలన అంటూ నినాదాలు చేశారు. అనంతరం హుస్నాబాద్‌లో నిర్వహించిన సంక్షేమ సంబరాలు సమావేశానికి వచ్చేసిన మంత్రి తన్నీరు హరీశ్‌రావును గిరిజనులు మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించుకున్నట్లు తెలిపారు. దీన్ని మంత్రి సానుకూలంగా స్పందించారని ప్రభుత్వానికి నివేదికను అందిస్తామని చెప్పినట్లు పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ భానోతు భాస్కర్‌నాయక్, నాయకులు భానోతు తిరుపతి, హరిలాల్, వేణు, బాలు, రాజు, ధరావత్ శ్రీనివాస్, రాజేందర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులు

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



హెల్మెట్లు అందజేస్తున్న రజనీకాంత్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మన కోసం కేఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి సహకారంతో మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో 250పైగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, బైక్‌పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



రుద్రారంలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతవ్వ, హెచ్‌ఎం మల్లేశం, ఉపాధ్యాయులు బాలకృష్ణ, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటఅర్బన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పార్ట్‌టైమ్ టీచర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాలల ప్రాంతీయ సమన్వయకర్త నిర్మల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతిక, రసాయన, సాంఘిక, జంతు, వృక్ష, రసాయన, వ్యాపారశాస్త్రం, అర్థశాస్త్రం, పౌరశాస్త్రం, నర్స్, పీఈటీ, లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పీజీ, బీఈడీ, జీఎన్ఎం, బీపెడ్, బీఎస్‌ఐసీ అర్హతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. జూన్ 15న మిట్టపల్లి గురుకుల పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే డెమోకు హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

దుబ్బాక: పట్టణంలో గల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు రెండురోజులు మాత్రమే గడువు ఉందని దుబ్బాక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేతుల మీదుగా ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐటీఐ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు భవిష్యత్‌లో మంచి ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. 10వ తరగతి పూర్తయిన ఆసక్తి గల అభ్యర్థులు గడువులోపు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు దుబ్బాకలో మెగా జాబ్‌మేళా

దుబ్బాకటౌన్: పట్టణంలో శనివారం జరిగే మెగా జాబ్‌మేళాలో 100కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. పట్టణంలోని రజనీకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగే జాబ్ మేళా ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారికి మంచి భవిష్యత్ ఇవ్వాలన్న సంకల్పంతోనే ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

జగదేవ్‌పూర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజన్న శుక్రవారం తెలిపారు. 50 ఏళ్లుగా కళాశాల మంచి ఫలితాలు సాధిస్తూ వస్తుందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, కోర్సులతో పాటు ఒకేషనల్‌లకు అడ్మిషన్లు ఉన్నట్లు తెలిపారు. చుట్టూ గ్రామాల పదో తరతగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

12న 5కే, 10కే రన్ పోటీలు

సిద్దిపేటకమాన్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12వ తేదీ సోమవారం ఉదయం 5.30 గంటలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి 5కే, 10కే, వాక్ అండ్ రన్నింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత శుక్రవారం తెలిపారు. ప్రతి ఒక్కరూ వాకింగ్, రన్నింగ్ తన దైనందన జీవితంలో భాగం చేసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యాధరి క్షేత్రంలో ఎమ్మెల్సీ పూజలు



అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి కొలువైన వర్గల్ విద్యాధరి క్షేత్రాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. అమ్మవారి సన్నిధిలో తన మనవరాళ్ల ఆర్షిక, అన్వికలకు శాస్త్రోక్తంగా అక్షరస్వీకారం జరిపించారు. అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. ఆలయ వర్గాలు వారికి సముచిత సన్మానం చేశారు. ఆయన వెంట జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు శశిధరశర్మ, పీఆర్టీయూ నాయకులు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, నర్సింహారెడ్డి, ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతి సీపీఎం కార్యకర్త పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ భజన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని కుల, మతాల మధ్య విభజన తీసుకొస్తూ ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజలను మోసం చేస్తుందన్నారు. కొమురవెల్లి మండలంలో ఒక్క కొమురవెల్లి మినహా మిగత 10 గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల ఊసే లేదన్నారు. వడగళ్ల వర్షం పడి నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమకాలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, అత్తిని శారద, తేలు ఇస్తారి, బక్కెల్లి బాలకిషన్, ఉల్లంపల్లి సాయిలు, దాసరి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆముదాల మల్లారెడ్డి

ప్రజలు, అధికారులకు మధ్య వారధిగా వీబీఓలు



ప్రజ్ఞాపూర్‌లోని జీపీపీ డిపోలో వీబీవోలకు కిట్స్‌ను అందజేస్తున్న నాయకులు



కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్: ప్రజలు, ఆర్టీసీ అధికారులకు మధ్య వారధిగా విలేజ్ బస్ ఆఫీసర్లు పని చేస్తారని మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆర్టీసీ డిపోలో విలేజ్ బస్ ఆఫీసర్ల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేజ్ బస్ ఆఫీసర్లకు మున్సిపల్ కమిషనర్, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డిపో నుంచి 21 మంది ఉద్యోగులను వివిధ గ్రామాలకు వీబీఓలుగా నియమించినట్లు తెలిపారు. వీబీఓలు ఎప్పటికప్పుడూ సంస్థ సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌లు, శుభకార్యాలకు, వివాహాలకు 10 శాతం రాయితీతో బస్సులను అద్దెకు ఇస్తారన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సులను ఆదరించి డిపో తోడ్పాటుకు సహకరించాలని డిపో మేనేజర్ వె వెంకటేశ్వర్లు కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నర్సయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీధర్, మెకానిక్ సూపరింటెండెంట్ సామ్యూల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ ఆర్టీసీ డిపోలో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారం వీబీవో(విలేజ్ బస్ ఆఫీసర్) కార్యక్రమాన్ని 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నట్లు తెలిపారు. అంతేగాకుండా రాయితీలపై బస్‌పాస్‌లను అందిస్తున్నామన్నారు. అంతకుముందు విలేజ్ బస్ ఆఫీసర్లుగా ఎంపికైన వారికి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ కనకలక్ష్మి, ఎంఎఫ్ చారి, ఎస్‌డీ ఐకేఎం రెడ్డి, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మహతీ ఆడిటోరియంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, వైస ఎంపీపీ కృష్ణాగౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం చెక్కులను శుక్రవారం ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సద్గుణ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆశాజ్యోతి, రైతుబంధు సమితీ మండల కో–ఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న నాయకులు

కంటివెలుగు బృహత్తరమైన పథకం



వైద్యపరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: కంటి వెలుగు బృహత్తరమైన పథకమని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మక్తమాసన్‌పల్లిలో శుక్రవారం సర్పంచ్ రజితవెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్ ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతులు, సౌకర్యాలతో ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బెల్దె కృష్ణగౌడ్, గ్రామస్తులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వెలికట్టలో..

కొండపాక(గజ్వేల్): అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని చేపట్టిందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెలికట్టలో సర్పంచ్ అమ్ముల రమేశ్, రైతుబంధు సమితీ మండల కో–ఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుమార్‌లతో కలిసి శుక్రవారం కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు రాంచంద్రారెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, నాయకులు పెరుగు అంజనేయులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడానికే ఉత్సవాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): అనవసరమైన ఆర్భాటాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలను మోసం చేయడానికే దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని డీసీసీ కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండు ప్రాజెక్టులు నిర్మించినా చెరువులు, కుంటలకు కాల్వలు తవ్వకుండా, నీటిని నింపకుండా చెరువుల పండగలు చేయడం సిగ్గుచేటన్నారు. చెరువుల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతుంటే, అధికారులు, నాయకులు చెరువు కట్టలపై బతుకమ్మలు, సహపంక్తి భోజనాలు, విందు లు, వినోదాలు చేసుకోవడంపై ప్రజలు ఆశ్చ ర్యం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏం సాధించార ని ఈ ఉత్సవాలు చేస్తున్నారో ప్రజలకు అర్థం కాని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సమావేశంలో నాయకులు మహేందర్, జయంత్, గణేశ్, పరశురాములు, వేణు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు ర్యాగల్ల దుర్గయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌లు అన్నారు. మండల పరిధిలోని రవీంద్రనగర్ గ్రామంలో మర్క రవి కుటుంబానికి మంజూరైన రూ.60వేల చెక్కును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబ, సర్పంచ్‌లు అమ్ముల రమేశ్, శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు కోడెల మల్లేశం, నాయకులు రవీందర్, ముత్యంరావు, స్వామి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.